

విజయవాడ నగరంలో జరుగుతున్న జింఖానా గ్రౌండ్లో 'మోడీని ఓడించండి.. దేశాన్ని కాపాడండి' కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి జిల్లా నాయకులు

శ్రీవారి సేవలో ప్రధాని మోడీ

కట్టుదిట్టమైన భద్రత నడుమ పర్యటన

ప్రజాశక్తి- తిరుమల

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుమలలో వేంకటేశ్వర స్వామిని షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం దర్శించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణతో వచ్చిన మోదీ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాని కొద్దిసేపు ఆలయంలో గడిపారు. ఆ తర్వాత ఆలయ పండితుల నుంచి వేద ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు మోడీకి అందజేశారు. శ్రీవారి ఆలయానికి వచ్చిన మోడీకి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మహాద్వారం దగ్గర ఘనస్వాగతం పలికారు. టీటీడీ చైర్మన్, ఈఓ ధర్మారెడ్డి శ్రీవారి పట్టువస్త్రంతో ప్రధానిని సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి చిత్రపటం, 2024 టీటీడీ క్యాలెండర్, డైరీలను టీటీడీ అధికారులు మోదీకి అందజేశారు. షెడ్యూల్ సమయం కంటే అర్ధగంట ముందే మోడీ శ్రీవారిని దర్శించుకొని అతిధిగహం చేరుకున్నారు. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ 2015, 2017, 2019లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఇప్పుడు నాలుగోసారి వచ్చారు.

రంగనాయకుల మండపంలో ఆలయ పండితుల నుంచి వేద ఆశీర్వాదాలు తీసుకుంటున్న ప్రధాని మోడీ

మోడీకి సాదర వీడ్కోలు..

తిరుమల, తిరుపతి పర్యటన అనంతరం తిరుగు పయనమైన ప్రధాని మోడీకి సాదర వీడ్కోలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి, డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి సాదర వీడ్కోలు పలికారు. తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి మోడీ ప్రత్యేక నావికాదళ విమానంలో బయలుదేరారు.

తిరుపతి విమానాశ్రయంలో వీడ్కోలు పలుకుతున్న రాష్ట్ర సిఎస్, డిజిపి, జిల్లా కలెక్టర్, ఎస్పీ

మోడీ కోసం ట్రాఫిక్ జామ్

తిరుపతి సిటీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన కోసం తిరుపతి పోలీసులు ప్రదర్శించి, సుమారు రెండున్నర గంటలకు పైగా నగరంలో ట్రాఫిక్‌ను స్తంభింప చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుమల శ్రీవారి దర్శనం నిమిత్తం, ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఈసందర్భంగా తిరుపతి నగరంలో సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు పోలీసులు ట్రాఫిక్కును స్తంభింప చేశారు. తిరిగి సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉండగా, ఉదయం 7.45 గంటల నుంచి అలిపిరి కపుల్ తీర్థం, కొర్లగుంట రోడ్డు, లీలామహల్ జంక్షన్ ఎస్వి జూపార్క్ చెర్లోపల్లి రోడ్డు, రుయా హాస్పిటల్, తదితర ప్రాంతాలలో వాహనాలు వెళ్లలేకుండా, పోలీసుల అడ్డుకున్నారు. సుమారు 10.30గంటల కి ట్రాఫిక్‌ను వదలడంతో కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించాయి. ఉదయం 9 గంటలకు కాలేజీలు, స్కూల్స్‌కు వెళ్లాల్సిన విద్యార్థులు, విధులకు హాజరవుతున్న ఉద్యోగులు అవస్థలు పడ్డారు. అదే సమయంలో తిరుపతిలో జోరున వర్షం రావడంతో వాహనదారులు వర్షంలో తడుస్తూనే వేచి ఉండడం గమనార్హం.

శ్రీవారి ఆలయాన్ని రక్షించండి : రమణ దీక్షితులు

తిరుమల: తిరుమల క్షేత్రం హిందుయేతర ప్రభుత్వం కబంధహస్తాల్లో ఉందని శ్రీవారి ఆలయాన్ని రక్షించాలని ట్విట్టర్ వేదికగా ఏపీ ప్రభుత్వంపై ప్రధానమంత్రికి శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు ఫిర్యాదు చేశారు. క్రమపద్ధతిలో హిందూ దేవాలయాలను, పురాతన సంప్రదాయాలు, నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని అన్నారు. ఇంతకాలం హైందవ సనాతన ఆస్తిగా టీటీడీలో అంతర్భాగంగా ఉన్న ఆలయ సంపదను నామరూపాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. దయచేసి తిరుమల క్షేత్రాన్ని రక్షించంచి వెంటనే తెలుగునెలపై హిందూ రాష్ట్రాన్ని స్థాపించాలని ట్విట్టర్‌లో కోరారు.

భారమవుతున్న 'బియ్యం'

- ఏడాదిలోనే కిలోకు రూ.10కిపైగా పెంపు
- వరి సాగు తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు
- విద్యుత్ ఛార్జీల పెంపుతో పెరిగిన మిల్లింగ్ ఛార్జీలు
- ఎగుమతులపై నిషేధం విధించినా ఫలితం శూన్యం

దుకాణంలో బియ్యం

ప్రజాశక్తి - బాలాయపల్లి

ఆంధ్రరాష్ట్రం అన్నపూర్ణగా పేరు పొందింది. నిత్యం పంటలు పండిస్తున్నా, వరి సాగుపై రైతులు ఎక్కువగా మొగ్గు చూపేవారు. అటువంటి ఆంధ్రాలోనే బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. ఏడాదిలోనే కిలోకు రూ.10లపైనే ధర పెరిగింది. సూపర్‌ఫైన్ రకం బియ్యం 25 కేజీల బస్తా రూ.1,325లు నుంచి రూ.1,550లకు చేరింది. రిటైల్‌గా రూ.1,600లు వసూలు చేస్తున్నారు. ఇక ఫైన్ రకం రూ.1,160 నుంచి రూ.1,350లకు, మధ్యస్తరకం రూ.1,250లకు, సాధారణ రకం రూ.900 నుంచి రూ.1,000లకు చేరింది. ఇంత కన్నా తక్కువ ధరకు ఏ బియ్యమూ దుకాణాల్లో లభ్యం కావట్లేదు. దీంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని సేకరించి, పాలిష్ పట్టించి, కొంత ఇతర దేశాలకు ఎగుమతి చేసి, ఇంకొంత కిలో రూ.25ల చొప్పున దుకాణాలకు సరఫరా చేస్తుండటంతో వీటినే కిలో రూ.35 నుంచి రూ.40లకు అమ్ముతున్నట్లు సమాచారం.

సామాన్య, మధ్య తరగతి ప్రజల అవస్థలు..

రాష్ట్రంలో ఎక్కువగా వాడుతున్న సన్నరకాల బియ్యం ధరలు అంతకంతకు పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది బియ్యం సగటు ధర కిలో రూ.43.19లు మాత్రమే ఉంది. కానీ, ఏపీలో మాత్రం బియ్యం అధిక ధరకు అమ్ముతున్నారు. తడిసిన, రంగుమారిన, ఎక్కువ కాలం నిల్వ ఉన్న రకాలు కూడా రూ.35ల కంటే తక్కువకు లభించట్లేదు. కామన్ వెరైటీ మాత్రమే రూ.40లకి ఇస్తున్నారు. ఫైన్ రకాలు కిలో రూ.50లకి తక్కువ లేనేలేవు. గతేడాది కిలో రూ.40-45 మధ్య ఉన్న బియ్యం ఇప్పుడు రూ.55లు చెప్తున్నారు. సన్న బియ్యం కిలో రూ.64లు దాకా పలుకుతున్నాయి. బాస్మతి రకం కిలో రూ.120లపైనే చెప్తున్నారు. ఈ ఏడాది ఆగస్టులో సూపర్‌ఫైన్ కిలో సగటున రూ.57.59, ఫైన్ రకం రూ.50.60, సాధారణ రకం రూ.38.66లు ఉన్నాయి. మూడు నెలల్లోనే కిలోకు రూ.5నుంచి రూ.10ల వరకు పెరిగాయి.

ఆంధ్రలో అధిక రేట్లు..

గతంలో నాలుగైదేళ్లకోసారి పెరిగే బియ్యం ధరలు గత ఐదేళ్లుగా ఏటా పెరుగుతూనే ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్‌తో నిమిత్తం లేకుండా గతేడాది కాలంలో నెలనెలా బియ్యం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దేశంలో బియ్యం ధరలు పెరుగుతున్నాయని గత జూలైలో బాస్మతేతర రకాల బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. దీంతో విదేశాల్లో వరికి విపరీతమైన డిమాండ్ రాగా, ధాన్యం అధికంగా పండించే ఏపీలోనూ బియ్యం ధరలు ఏమాత్రం తగ్గకపోగా, స్థానికంగా పెరుగుతూనే ఉండటం గమనార్హం. పేదలు బియ్యం కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు.

ప్రభుత్వం రైతు వద్ద ధాన్యం కొనడం లేదు..

రాష్ట్రంలో పండించిన ధాన్యంలో సగం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. ప్రజాపంపిణీ విధానంలో 35 నుంచి 40శాతం సేకరించి, మిగతా ధాన్యాన్ని సేకరించకుండా చేతులెత్తేస్తుండటంతో ఈ ఏడు వరిసాగు తగ్గింది. దీంతో బియ్యం ధరలపై తీవ్రప్రభావం చూపుతోంది. ఖరీఫ్ సీజన్‌లో 38.80లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సిన సార్వా వరి 32.62లక్షల ఎకరాల్లోనే సాగవుతోంది. వర్షాభావం, సాగునీటి ఇబ్బందులు, పెట్టుబడుల భారం, ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో 6 లక్షలపైగా ఎకరాల్లో వరి సాగు తగ్గింది. అంతటా వర్షాభావంతో మొదటి పంట ఆలస్యం కావడంతో సాధారణ విస్తీర్ణంలోనూ రెండో పంటగా రైతులందరూ వరివేసే పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు రబీలో దాళ్వా వరి సాగుకు అవసరమైన నీరు వస్తుందన్న గ్యారెంటీ లేదు. ఇలాగే గత ఏడాది వరి సాగు బాగా తగ్గింది. సన్నరకాల బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

మిల్లర్లకే అమ్ముకోవాలి..

పండించి పంట కల్లలలో ఉంచకోలేక రైతులు వచ్చిన రేటుకు మిల్లర్లకే అమ్ముకుంటున్నారు. వాస్తవంగా గతంలో ప్రభుత్వం సేకరించగా, రైతులు, ప్రజల అవసరాలకు పోగా, ఇంకా 20లక్షల టన్నులపైగా బియ్యం మిగిలిపోవడంతో డిమాండ్ లేక ధరలు సామాన్యులకు కాస్త అందుబాటులో ఉండేవి. కానీ గత ఏడాదీ పండిన ధాన్యంలో రెండు సీజన్లకు కలిపి 35 శాతం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీంతో రైతులు నాణ్యమైన సన్న రకాలను మధ్యవర్తుల ద్వారా మిల్లర్లకు అమ్ముకోవడంతో గత ఐదారు నెలలుగా పెరిగిన విద్యుత్ ఛార్జీల కారణంగా మిల్లింగ్ ఛార్జీలను దష్టిలో పెట్టుకుని బియ్యం ధరలు పెంచారు.

ధర పెరుగుతూనే ఉంది...
- గౌతమి, ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయురాలు

బియ్యం ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉండటంతో బియ్యం కొనాలంటేనే భయమేస్తుంది. ఈ ఏడాది బియ్యం రేట్లు ఇంతగా పెరుగుతాయని అనుకోలేదు. ఈ ధరలు ఇలా పెరుగుతూనే ఉంటే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా జీవించాలి.

శేష వాహనం ముందు

శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటం ఇవ్వడం ఆనవాయితీ

దీన్ని కూడా కొందరు రాజకీయం చేయడం దౌర్భాగ్యం : టీటీడీ ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో గల శేష వాహనం ముందు వివిఐపిలకు శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటం ఇవ్వడం, వారిని అడిగి ఫొటోలు తీసుకోవడం జరుగుతూ ఉంది. అనంతరం వీటిని మీడియాకు, వివిఐపిలకు కూడా పంపడం ఆనవాయితీగా వస్తోందని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని కూడా కొందరు రాజకీయం చేసి విమర్శలకు దిగడం దౌర్భాగ్యమని ఆయన చెప్పారు. ఈ సంప్రదాయంలో భాగంగానే సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి వేదపండితులు ఆశీర్వచనం చేశారన్నారు. తానే ప్రధానమంత్రి ఆహ్వానించి అక్కడ వారికి స్వామివారి ప్రసాదాలతో పాటు టీటీడీ కాఫీ టేబుల్ బుక్, పంచగవ్య ఉత్పత్తులు, 2024 డైరీ, క్యాలెండర్, స్వామివారి చిత్రపటం అందించడం జరిగిందని వివరించారు. ఆశీర్వచనం తరువాత తానే ప్రధానమంత్రిని ఆహ్వానించి ఫొటోలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అయితే కొంతమంది స్వామివారి శేష వాహనం ముందు ఇలా చేయడం సరికాదని ప్రచారం చేయడం సబబు కాదని పేర్కొన్నారు. ఎన్నోఏళ్లుగా ఆలయానికి వచ్చే వివిఐపీలకు రంగనాయకుల మండపంలోని శేష వాహనం ఎదుట స్వామివారి ప్రసాదాలు, చిత్రపటం తదితరాలు ఇవ్వడం, వారిని అడిగి ఫొటోలు తీసుకోవడం జరుగుతోందన్నారు. వీటినే మీడియాకు పంపడమనేది ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. స్వామివారి దర్శనం తరువాత వివి ఐపిలు , విఐపిలు రంగనాయకుల మండపంలోని శేషవాహనం ముందే ఫొటోలు తీసుకునే ప్రదేశమని, అయితే కొందరు వ్యక్తులు ఈ విషయాన్ని కూడా వివాదాస్పదం చేయాలనుకోవడం దౌర్భాగ్యమన్నారు. దేవుడి దర్శనాన్ని కూడా రాజకీయం చేసి విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి దుర్మార్గపు ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని ఛైర్మన్ కోరారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి: సెర్ప్ సీఈఓ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: మహిళా సంఘాలు బలోపేతం కావాలని సెర్ప్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. తిరుపతి జిల్లాలోని ఎస్వి యూనివర్సిటీ సెనేట్ హాల్ ఎస్ఇఆర్పి, సీఈవో ఇంతియాజ్ అహ్మద్ రాయలసీమ, నెల్లూరు జిల్లాలలోని 9మంది ప్రాజెక్ట్ డైరెక్టర్స్, డిపిఎంయు సిబ్బందితో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎస్ఇఆర్పి వారు అమలు చేస్తున్న పలు కార్యక్రమాల ప్రగతిని సమీక్షించి దిశానిర్దేశం చేశారు. సంస్థాగత నిర్మాణం (ఐబి)లో భాగంగా మహిళా సంఘాలు, గ్రామైక్య, మండల సంఘాలను బలోపేతం చేయాలని తెలిపారు. ఎన్ఆర్ఎల్ఎం కార్యక్రమాలు అన్నీకూడా సకాలంలో గడువు లోపు పూర్తిచేయాలని సూచించారు. లైవ్లీ హుడ్స్ జీవనోపాధులో భాగంగా పెద్దయూనిట్ ఎంటర్ప్రైసెస్‌ను ప్రతి జిల్లా వారు తమకిచ్చిన టార్గెట్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. పీఎంఈజీపి, పియంఎఫ్ఎంఈ రుణాలను సభ్యులకు సబ్సిడీ రూపంలో తప్పనిసరిగా ఇప్పించెలా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో కొత్తగా లైవ్లీ హుడ్ కార్యక్రమాలను సంఘం స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అమలు చేయాలని తెలిపారు. చేయూత కార్యక్రమం కింద ప్రతి జిల్లాలో ప్రతి మండలం నందు మహిళా మార్ట్ ఏర్పాటు చేయాలని, ఇది వరకే ప్రారంభించిన మార్ట్‌లు లాభదాయకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్త్రీ నిధి రుణాలు అందరికీ అందేలా, రికవరీ 100 శాతం ఉండేలా చూడాలన్నారు. స్త్రీ నిధి నిధుల దుర్వినియోగం చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పథక సంచాలకులను ఆదేశించారు. సమావేశంలో 9 జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్‌లు, సిబ్బంది, ఎస్ఇఆర్పి డైరెక్టర్స్ పాల్గొన్నారు.

శ్రీశైలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మల్లన్న క్షేత్రంకు శ్రీకాళహస్తి ఆర్టిసి డిపో నుంచి డిసెంబర్ 3,4 తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజ వర్ధన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీ టూర్‌గా రెండు రోజులపాటు యాగంటి, మహానంది మీదుగా శ్రీశైలం శివ క్షేత్రంకు శ్రీకాళహస్తి నుంచి అల్ట్రా డీలక్స్ బస్సు తెలిపారు. రానుపోను బస్సు ఛార్జి రూ.2 వేలు అనీ, డిసెంబర్ 3వ తేదీ ఉదయం నాలుగు గంటలకు బస్సు బయలు దేరుతుందని చెప్పారు. టిక్కెట్ రిజర్వేషన్ సౌకర్యము కలదనీ, భక్తులు, ప్రయాణికులు వివరాల కొరకు 73828 80178, 73828 80239, 73828 75642 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏపీ యుటిఎఫ్ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రెండవ కౌన్సిల్ సమావేశాలు పుత్తూరులో జరిగాయి. ఈసందర్భంగా జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా జరిగిందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బత్తల లక్ష్మీరాజా, పరిశీలకులుగా రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు వ్యవహరించారు. ఎన్నికైన తిరుపతి జిల్లా నూతన కమిటీ యుటిఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులుగా జీజే.రాజశేఖర్ (డివి.సత్రం), ప్రధాన కార్యదర్శిగా కే.ముత్యాలరెడ్డి (రేణిగుంట) గౌరవ అధ్యక్షులుగా కే.శేఖర్ (సూళ్లూరుపేట), సహాధ్యక్షులుగా కెఎస్‌బి సూర్యప్రకాష్ (కేవిబిపురం), కందల శ్రీదేవి (నారాయణవణం), కోశాధికారిగా పి.రమేష్ నాయుడు (పాకాల), జిల్లా కార్యదర్శులుగా దండు రామచంద్రయ్య (రేణిగుంట), బండి మధుసూదన్ రెడ్డి (తిరుపతి అర్బన్), ఎన్.శేఖర్ (వడమాలపేట), ఏ.పద్మజ (తిరుపతి రూరల్), ఎం.కుమారస్వామి (చిట్టమూరు) కె.ప్రభాకర్ (సూళ్లూరుపేట), జి.సుధీర్ (గూడూరు రూరల్), ఏ.హరిబాబు (ఓజిలి), ఐ.మస్తానయ్య (చిట్టమూరు), సీ.సురేష్ (తిరుపతి), కె.మోహన్ బాబు (శ్రీకాళహస్తి రూరల్), ఓ.విజయ కుమార్ (తొట్టంబేడు), సి.వెంకట కష్ణయ్య (బిఎన్‌కండ్రిగ), ఈ.గీతమ్మ (పుత్తూరు), రాష్ట్ర కౌన్సిలర్లుగా దేవరాల నిర్మల (తిరుపతి అర్బన్), కే.సదాశివరెడ్డి (ఎర్రవారిపాలెం), ఎం.రామమూర్తి రాజు (నాయుడుపేట), టి.వాసుదేవరావు (గూడూరుఅర్బన్), వై.విజయశ్రీ (తొట్టంబేడు), కే.ఆదినారాయణ (వెంకటగిరి), బి.రమేష్‌బాబు (కోట), ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎన్.మోహన్ (తిరుపతి అర్బన్), ఎస్.బాబు (తడ), పి.శివకుమార్ (శ్రీకాళహస్తి), ఎం.నాగేశ్వరరావు (గూడూరు), సురేష్ (పుత్తూరు), ఓ.దీపిక (బిఎన్.కండ్రిగ), కే.చంద్రశేఖర్ (రేణిగుంట), జిల్లా మహిళా కమిటీ కన్వీనర్‌గా కేఎంఎస్.సునీల (సూళ్లూరుపేట), సోషల్ మీడియా కన్వీనర్‌గా కే.భాస్కర్ (పుత్తూరు), ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్‌గా ఓ.మునయ్య (కేవీబీ పురం), ఓపిఎస్ సాధన కమిటీ కన్వీనర్‌గా ఎస్ఈ.నరేష్ (పిచ్చాటూరు), అక్కడమిక్ సెల్ కన్వీనర్‌గా నరసింహులు (కేవీబి పురం), కల్చరల్ కన్వీనర్‌గా ఎస్.బాబు (తడ), ఎంటిఎస్ టీచర్ల కన్వీనర్‌గా కే. లోకనాథం (పుత్తూరు)లు ఎన్నికైనారు.

జిజె.రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు యుటిఎఫ్

కె.ముత్యాల రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యుటిఎఫ్

నిషేధిత భూములకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

డికెటి పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్న అధికారులు డిప్యూటీ మేయర్ అభినయ్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: 22ఏ కింద నిషేద భూములకు రిజిస్ట్రేషన్ చేయించే ప్రకియ ప్రారంభమైందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. 22ఏ కింద తిరుపతిలోని తాతయ్యగుంట కట్ట భూములను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి సోమవారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి సాక్షి సంతకం చేసి వారికి పత్రాలను అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి మోసం చేసిందని గుర్తు చేస్తూ, నేడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేయూతతో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ ప్రకియ ప్రారంభమైందన్నారు. నేడు తాతయ్యగుంట కట్టకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రకియ జరుగుతున్నదని, ఇప్పుడు చేయించే రిజిస్ట్రేషన్ పత్రాలనే మూలపత్రాలుగా గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రజల్లో అపోహలు సష్టించి రిజిస్ట్రేషన్‌లు చేయరు అదంతా ఉత్తి మాటలని టిడిపి నమ్మించే ప్రయత్నం చేసిందని, ఆ అపోహలు తొలగిస్తూ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, టౌన్‌బ్యాంక్ వైస్‌చైర్మెన్ వాసు యాదవ్ పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో కమిషనర్ హరిత అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. డయల్ యువర్ కమిషనర్‌కు 8, స్పందనకు 16 పిర్యాధులు అందినట్లు తెలిపారు. వాటిలో ముఖ్యంగా టీటీడీ పరిపాలనా భవనం ముందున్న తాత్కాలిక స్పీడ్ బ్రేకర్లలో కొన్నింటిని తొలగించారని, ఇక్కడ వాహనాల స్పీడ్ కంట్రోల్ కొరకు పర్మినెంట్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలనే పిర్యాధుపై కమిషనర్ స్పందిస్తూ నగరంలో రద్దీ ప్రాంతాలను గుర్తించి, అవసరమైన ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలపై కమిషనర్ స్పందిస్తూ సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి కషి చేయాలన్నారు. ఉపకమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికార్లు కెఎల్.వర్మ, సేతుమాధవ్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీప్లానర్, మేనేజర్ చిట్టిబాబు, సూపరింటెండెట్లు డీఈలు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

నేడు కులగణన పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

ఈనెల 28వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గల ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కుల గణనపై ప్రాంతీయ అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించ బడుతుందని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కుల సంఘాల నాయకులు హాజరై తమ అమూల్యమైన సలహాలు సూచనలు ఇవ్వవలసిందిగా కోరారు.

తిరుపతి ఐఎంఎ శాఖకు రాష్ట్రస్థాయి అవార్డులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : విజయవాడలో ఈనెల 25,26 తేదీలలో జరిగిన ఐఎంఏ రాష్ట్ర మహాసభలో తిరుపతి ఐఎంఏ శాఖకు అవార్డుల పంట రావడం జరిగింది. ఈఏడాది 5 అవార్డులను తిరుపతి శాఖకు ప్రదానం చేశారు. ఈ అవార్డులను ఐఎంఎ జాతీయ అధ్యక్షులు ఐఎంఏ డాక్టర్ శరత్‌కుమార్ అగర్వాల్, జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు, జాతీయ సెక్రటరీ జనరల్ డాక్టర్ అనిల్ కుమార్ జే నాయక్, జాతీయ కోశాధికారి డాక్టర్ శిట్టిబాలీ అవార్డులను ప్రధానం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికష్ణ, సెక్రెటరీ డాక్టర్ ఫణిధర అవార్డులను ఎంపిక చేశారు. తిరుపతిశాఖకు ఇంటర్నేషనల్ వేస్ట్ మేనేజ్మెంట్ కాన్ఫరెన్స్ ప్రోగ్రాం చేసినందుకుగాను ఒక అవార్డు, డాక్టర్స్ డేను రాష్ట్రస్థాయిలో సదస్సుగా నిర్వహించినందుకు గాను మరో అవార్డు, ఆవోగాన్ చలే ప్రోగ్రామ్ క్రింద గ్రామాలను దత్తత తీసుకున్నందుకుగాను ఇంకో అవార్డును అందజేశారు. వ్యక్తిగత స్థాయిలో డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావుకి జాతీయ, రాష్ట్ర ఐఎంఎకు మధ్య సమన్వయంగా ఉండి కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను ప్రత్యేక అభినందన అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ రాయపు రమేష్‌కి తను చేసినటువంటి సీజీపీ (కాలేజ్ అఫ్ జనరల్ ప్రాక్టీషనర్)లో ప్రతినెలా ఇంటర్నేషనల్ స్థాయిలో వర్చువల్ మీటింగ్ జరిపినందుకుగాను అవార్డు ప్రదానం చేశారు. గత ఐదు సంవత్సరాలలో ఈసారి ఎక్కువ అవార్డులను డాక్టర్ హరికష్ణ, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ నాగేశ్వరెడ్డి, అధ్యక్షులు కార్యదర్శి ట్రెజరర్‌గా ఉన్న సందర్భంలో రావడం సంతోషమని, హదయపూర్వకంగా అభినందిస్తున్నామని ఐఎంఐ జాతీయ రాష్ట్ర నాయకులు తెలిపారు.

విద్యానికేతన్‌లో షేక్స్పియర్ గార్డెన్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిట

శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ విశాలమైన క్యాంపస్‌లో భారతదేశపు మొట్టమొదటి షేక్స్పియర్ గార్డెన్ ప్రారంభించారు. ఎస్బిఐఎస్లో ఆంగ్ల ఉపాధ్యాయురాలు వరలక్ష్మి మాట్లాడుతూ మహోన్నత కవి షేక్స్పియర్‌కు నివాళి అన్నారు. ఇది విద్యార్థుల విద్యా అనుభవాన్ని సుసంపన్నం చేస్తూ సాహిత్యం ప్రకతి పట్ల ప్రేమను పెంపొందించనుందని తెలిపారు. షేక్స్పియర్ నాటకాలు, సొనెట్‌లలో చిత్రీకరించబడిన మంత్రముగ్ధులను చేసే ప్రపంచాల నుండి ప్రేరణ పొందిన ఎస్విఐఎస్ సేక్స్‌పియర్ గార్డెన్ అని పేర్కొన్నారు. ఈఉద్యానవనం వక్షజాలం జంతుజాలం సమ్మేళనంగా ఉంటుందని, ఇక్కడ సువాసనగల పువ్వులు, పచ్చదనం షేక్స్పియర్ పద్యాల కవితా వైభవాన్ని ప్రతిధ్వనిస్తాయన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, వారి విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ వర్సిటీ అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..!

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీ, మండల గ్రామీణ ప్రాంతాలలో కొద్దిపాటి వర్షానికే జనజీవనం స్తంభించేలా, నడవడానికి వీలు లేనంత విధంగా చిత్తడి చిత్తడిగా మారుతోంది. మండల గ్రామీణ ప్రాంతాల్లో సిద్ధవరం, పారుపోలు, కుర్జా గుంట, పెట్లూరు గ్రామాలలో డ్రైనేజీలు అస్తవ్యస్తం కావడంతో వర్షపు నీరు ఎటు వెళ్లాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటు గ్రామీణ ప్రాంతంలోనూ మున్సిపాలిటీ పరిధిలోని అదే పరిస్థితి ఉన్నా ఎన్ని రాజకీయ పార్టీలు వచ్చినా ఎంతమంది రాజకీయ నాయకులు మారినా వారి మనుగడ కోసం ఎన్నికల ముందు వాగ్దానాలు ఇచ్చి గెలిచిన తర్వాత మరిచి పోతున్నారని వెంకటగిరి వాసులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సిసి రోడ్లు నిర్మించి డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఎక్కడ వర్షపు నీరు అక్కడే నిలవడంతో డెంగీ, మలేరియా వ్యాపింపజేసే దోమలకు నిలయంగా మారుతున్నాయి. దోమలను నివారించడానికి శానిటేషన్ పనులు చేయకుండా వాటికి వస్తున్న నిధులను అధికారులు కాజేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిస్తే దోమల బారి నుండి ప్రజలను రక్షించవచ్చుని పేర్కొంటున్నారు.

అటవీశాఖ భవనాలను ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్ద గల ఫారెస్ట్ కాంప్లెక్స్ లో నూతనంగా నిర్మించిన, ఆధునీకరించిన సిసిఎఫ్ చాంబర్ ను, నూతన ఆర్ఓ, జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయాన్ని ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ సందర్భంగా రాష్ట్ర పిసిసిఎఫ్ మధుసూదన్ రెడ్డి, సిసిఎఫ్ నాగేశ్వరరావు, డిఎఫ్ఓ సతీష్ రెడ్డి ఇతర అధికారులు మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నిర్మించిన, ఆధునీ కరించిన సిసిఎఫ్, డిఎఫ్ఓ, కార్యాలయాలను మంత్రి ప్రారంభించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోద భాయ్, సిఎఫ్ వెంకటేశ్వర్లు, జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ సి.సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారు లు, రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

డాక్టర్ కృష్ణవేణికి జాతీయ ప్రతిభా పురస్కారం

జాతీయ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కృష్ణవేణి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి కృష్ణవేణి కళా మిత్రమండలి, ఒంగోలు వారిచే జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందు కున్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర ఈ అవార్డును అందించారు. తెలుగు సాహిత్యం, కళలు వంటి అంశాలపై వీరు చేస్తున్న కృషికి ఈ అవార్డును అందిస్తున్నట్లు కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు తెలి పారు. తెలుగు భాష అభివృద్ధికి కృష్ణవేణి మరింత కృషి చేయాలని కళామిత్ర మండలి ఈ అవార్డు ఇచ్చినట్లు కమిటీ ఛైర్మన్ తెళ్ళ అరుణ తెలిపారు. ప్రతిష్టాత్మకమైన అవార్డును స్వీకరించినందుకు శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. కె మహిదేవమ్మ కృష్ణవేణిని అభినందించారు. కళాశాల విద్యార్థినులకు తెలుగు భాషపై మక్కువ కలిగించే కార్యక్రమాలు మరెన్నో చేస్తానని కృష్ణవేణి తెలిపారు.

ప్రైవేట్ ఫైనాన్స్ లైసెన్సులు రద్దు చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి-నాయుడుపేట: ప్రైవేట్ ఫైనాన్స్ లైసెన్సులు రద్దు చేయాలని సిఐటియు నాయకులు కోరారు. తిరుపతి జిల్లా ఆటో డ్రైవర్ జనరల్ బాడీ సమావేశం నాయుడుపేట వేదనపర్తి సుందర్ రామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వి. రమణయ్య, తంజావూరు మురళి మాట్లాడుతూ ఆటో కార్మికులను నిలువు దోపిడీకి గురి చేస్తున్న ప్రైవేట్ ఫైనాన్స్ ల లైసెన్సులు వెంటనే రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా అతి తక్కువ వడ్డీతో ఆటోలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వాహన మిత్ర లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్ అందరికీ వర్తింపచేయాలని ప్రతి డ్రైవర్ కు రెండు సెంట్లు భూమి ఇచ్చి గట్టి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఆటో కార్మికులు ఆటో నడుపుతున్నప్పుడు బండి సంబంధించిన అన్ని పత్రాలు, కాకి చొక్కా వేసుకొని ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని, వారు తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ ముకుంద, ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కే లక్ష్మయ్య, కార్యదర్శి జి రాజా, బి రమేష్, సభ్యులు బి వెంకటరమణ, కె చంద్ర, తదితర సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక మహా ధర్నాకు తరలిన గూడూరు మండల సిఐటియు నాయకులు

మహాధర్నాకు తరలిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సిఐటియు అధ్వర్యంలో కార్మిక, కర్షక మహా ధర్నాకు గూడూరు సిఐటియు నాయకులు వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరు సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా మార్చి కార్మిక హక్కులను కాల రాసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని తెలిపారు. ఇకనైనా కార్మికులందరూ సంఘటిత మై హక్కుల కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ ఉషా, జానకి, చెంగలమ్మ, పావని, సునీత, మున్సిపల్ సంఘం నాయకులు గోపీ, రాజా గోపాల్, కోటి, రమేష్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సోమవారం దిగవూరు, ఎగవూరు పంచాయతీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపిఆర్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోని పేద ప్రజలకు పిఎమ్ కిసాన్, గరీబ్ కళ్యాణ యోజన, జన్‌దన్ యోజన, విశ్వకర్మ యోజన లాంటి సుమారు పదిహేను రకాల సంక్షేమ పథకాలు ఆమలు చేస్తోందని, ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి వుండి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉజ్వల యోజన పథకం కింద వంట గ్యాస్ పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్ రెడ్డి, దేవప్రసాద్, సెక్రటరీలు మదన మోహన్ రాజు, లోక మూర్తి, ఎంసిఐ గిరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వంటగ్యాస్ పరికరాలు అందిస్తున్న దృశ్యం

విద్యార్థుల రక్తదానం

రక్తదానం చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 40 మంది విద్యార్థులు సోమవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. చిత్తూరు రెడ్ క్రాస్ సంస్థకు ఎన్‌సిసి క్యాడేట్లు రక్తదానం చేశారన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలన్నారు. ఎన్‌సిసి ఆఫీసర్ డాక్టర్ ఈశ్వర్ బాబు మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాశిలమని, చిట్టి కళావతి, ఆది శేఖర్ రెడ్డి, రమణమ్మ, రెడ్ క్రాస్ సిబ్బంది, క్యాడేట్లు విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి- బుచ్చి నాయుడు కండ్రిగ: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే తొలిసారి జగనన్న ప్రభుత్వం అతి పెద్ద యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా సంబరాలు జరపబోతోంది. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటల ద్వారా యువత ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన వాళ్లు పోటీ పడేలా తీర్చి దిద్దడం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే 'ఆడుదాం ఆంధ్ర' లక్ష్యం. ఈ క్రీడలు డిసెంబర్ 15వ తేదీ మొదలై 50 రోజులపాటు కొనసాగనున్న ఈ క్రీడా సంబరాలకు మన రాష్ట్రానికి చెందిన 15 ఏళ్లు నిండిన యువతీ, యువకులు అందరూ అర్హులే. వెంటనే కింద ఇవ్వబడిన లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చును. హెచ్‌టిటిపి:// ఎఎడియుడిఎఎంఎఎన్‌డిఆర్ఎ.ఎపి.జివోవి.ఇన్‌లో పేర్లు నమోదు చేసుకోచ్చు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై ఖాతా దారులు అవగాహన కలిగి ఉండాలని చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ శ్రీకాళహస్తి శాఖా బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ సూచించారు. తొట్టంబేడు మండలం తంగేళ్లపాలెం సహకార కేంద్ర బ్యాంకు నందు సోమవారం డిజిటల్ ఆర్థిక లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యతపై నాబార్డు సౌజన్యంతో కళాజాతా ద్వారా ఖాతాదారులకు అవగాహన కల్పించారు. మారుతున్న కాలానుగుణంగా డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం సహకార కేంద్ర బ్యాంకులో లభించే సహకార సమైక్య భారతి డిపాజిట్స్ స్కీం, జీరో బ్యాలెన్స్ అకౌంట్స్, పలు బీమా పథకాలపై కూడా అవగాహన కల్పించారు. బ్యాంకు చైర్మన్ మణి నాయుడు, సీఈవో చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి: మురళి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పక్క రాష్ట్రాల్లో ఎస్టీ, ఎస్సీ జాబితాలో ఉన్న వడ్డెర కులాన్ని ఏపీలో కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలని టిడిపి వడ్డెర సాధికార సమితి కన్వీనర్ దేవల మురళి డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పక్ష నేతగా ఉన్న ప్రస్తుత సీఎం జగన్మోహన్ రెడ్డి వడ్డెరులకు ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. త్వరలో రాష్ట్ర మొత్తం తమ సమస్యలపై పర్యటించి గుంటూరు జిల్లాలో లక్ష మందితో వడ్డెరగర్జన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు శ్రీరాములు, దేవుళ్ళ శ్రీనివాస్, తిరుమలయ్య,రమణ పా ల్గొన్నారు.

బాలాయపల్లి : నిండలి, వెంకటరెడ్డిపల్లి, దక్కిలి మండలం మిట్టవడ్డిపల్లి గ్రామాలలో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యనమల చెంచు కృష్ణయ్య, యనమల వెంకట రమణయ్య ఈశ్వర్ లక్ష్మయ్య గురవయ్య చెంచయ్య ఈశ్వరయ్య వడ్డెర కుల బంధువులందరూ పాల్గొన్నారు.

డాక్టర్ విఆర్ రాసానికి ప్రతిష్టాత్మక జయప్రద అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : గొప్ప కథా , నవలా రచయిత్రి డాక్టరు పెళ్లకూరు జయప్రద పేరుతో ప్రతి సంవత్సరం ఉత్తమ నవలకి ఇచ్చే ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రఖ్యాత కథా, నవల, నాటక రచయిత డాక్టరు విఆర్ రాసాని ముద్రించిన 'వొలికలబీడు' అనే నవలకు జయప్రద అవార్డును ప్రకటించినట్లు పెళ్లకూరు జయప్రద తెలిపారు. రాసాని ఈ సంవత్సరంలో మట్టి బతుకులు, వొలికలబీడు, ఆదియోధుడు అనే మూడు నవలలను ముద్రించారు. వీటిలో ఎవరూ స్పృశించని కాటికాపర్ల గురించి రాసిన వొలికలబీడు, నవల ఎందరో పాఠకుల అభిమానాన్ని పొందింది. ఆదియోధుడు కూడా తెలుగువారి ప్రశంసల్ని అందుకుంది. ఈ రెండు నవలలు సాహిత్యంలో నిలిచిపోయేటివే నని తమ పురస్కార కమిటీ వారు ప్రశంసించారని కూడా తెలి పారు. ఈ పురస్కారానికి ప్రముఖ రచయిత్రి గంటి భానుమతి, మరోసాహితీ విమర్శకురాలు ఆచార్య సుశీలమ్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్లు జయప్రద వెల్లడించారు. డిసెంబర్ లో నెల్లూరులో జరిగే సభలో రచయితకు ఈ పురస్కారంతో బాటు 15 వేలు రూపాయలు నగదు బహుమతి ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా వి ఆర్ రాసానికి పలువురు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, ఎస్వీయూ పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సమానత్వంతోనే స్త్రీలపై హింస నిర్మూలన

- అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కె. సుధారాణి

ప్రజాశక్తి - క్యాంపస్ : మహిళలు, బాలికలపై హింసను నిరోధించడానికి, నిర్మూలించడానికి సమానత్వపు ఆలోచనలు ఎంతో దోహదం చేస్తాయని మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కె.సుధారాణి అన్నారు. ప్రపంచ మహిళలపై హింస వ్యతిరేక దినంను శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల బాలాజీ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కె.సుధారాణి మాట్లాడుతూ పురుషాధిక్య సమాజంలో స్త్రీ కి కూడా హక్కులు ఉన్నాయని గుర్తించి వారికి ఉన్న రక్షణలు చట్టాలు గౌరవిస్తే హింస సాధ్య మైనంత వరకు నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వయోజన విద్యా విభాగం విభాగాధిపతి డాక్టర్ ఆర్.బి సత్యవతి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి బాలిక లకు వివరించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, లక్ష్మి రాజ్యం, డీ. రమణ, డీ.రాజేశ్వరి, శ్రీలత కిషోరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - పిచ్చాటూరు : పిచ్చాటూరు మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మండల కేంద్రమైన పిచ్చాటూరు ఎంపిడివో కార్యాలయం సభప్రాగణం లో సోమవారం వైఎస్ ఎంపీపీ2 నాగభూషణం అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ శ్రీనివాసు లు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మండల సర్వ సభ్య సమావేశానికి ఎంపిపి, జడ్పిటిసి ఇద్దరూ గైర్హాజరు కావడం గమనార్హం. అనంతరం అధి కారు లు ప్రగతి నివేదిక చదివి వినిపించారు. ఎంఈవో యుగంధర్ రాజు మాట్లాడుతూ మండలంలోని నాడు నేడు రెండో విడత పనులు దాదాపు పూర్తి చేసినట్లు తెలిపారు. జడ్పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని సభలో మొర పెట్టుకున్నారు. డ్రైనేజి వ్యవస్థ లేక వర్షాకాలంలో ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిడివో మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సుజాతకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్ర విభాగం పరిశోధకురాలు పాలూరు సుజాతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి మూడే దామ్లా నాయక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య విభాగం ఆచార్యులు డాక్టర్ కె. జయ చంద్రారెడ్డి పర్యవేక్షణలో " కమర్షియల్ బ్యాంక్స్ అండ్ ఫామ్ క్రెడిట్ : ఏ స్టడీ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ " అనే అంశంపై పరిశోధనా గ్రంధాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను పాలూరు సుజాతకు డాక్టర్ డిగ్రీని ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. పాలూరు సుజాతకు డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల పరిశీలన

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డి కోదండరామిరెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికల దృష్ట్యా గ్రామస్థాయి నుండి బూత్ లెవెల్ అధికారి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. ప్రతి ఇంటి యజమానితో 18 సంవత్సరాలు నిండిన వారున్నారా లేరా, అడ్రసులో మార్పులు ఉంటే ఓటును వారి నివాస స్థలానికి మార్చడం, ఓటు ఉన్న వ్యక్తి లేకపోతే వారి వివరాలను కనుక్కొని తొలగించడం ఆ ప్రాంత ప్రజలను, వారు నివసిస్తున్న చుట్టుపక్కల వారిని విచారించి తగు చర్యలు చేపట్టాలని బూత్ లెవెల్ అధికారులకు, రాజకీయ పార్టీ నాయకులకు తెలిపారు.

ప్రజాదరణ సంతృప్తినిస్తోంది: పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం ప్రాంతంలో మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణ సంతృప్తిని కలిగిస్తోందని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. సోమవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ శేషాచల నగర్, గంగాదేవి ఎస్టి కాలనీ, తుడా క్వార్టర్స్ లో ప్రజలు పెద్ద సంఖ్యలో ఆహ్వానం పలికి సమస్యలను నానికి తెలిపారు. శేషాచల నగర్ లో జయమ్మ ఏడాది క్రితం తన భర్త సుధాకర్ అనారోగ్యంతో మరణించాడని, పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎవరో పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని నాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుమల నగర్ గ్రామ కమిటీ అధ్యక్షులు గోవింద రాజులు, ఉపాధ్యక్షులు, వార్డు సభ్యులు రాధాకృష్ణ, కార్యదర్శి చెన్నరాయప్ప, టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ టీడీపీ అధ్యక్షులు ఈశ్వరయ్య, అజిస్ భాష, మహేశ్వరి, అనసూయ, గల్లా సుధాకర్, కిషోర్, డిల్లిబాబు, గుణశేఖర్, యుగంధర్, గంటా వెంకటకృష్ణ, ప్రభాకర్, హరి, జ్యోతికృష్ణ, జనార్ధన్, రాంజీ, గంగాధరం, విజయ్, సూరి పాల్గొన్నారు.

శ్రీలంకలో పుత్తూరు డాక్టర్‌కు ప్రశంస

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: శ్రీలంకలో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్,యూనివర్సిటీ ఆఫ్ కాంప్లిమెంటరీ మెడిసిన్ లో పుత్తూరు కు చెందిన డాక్టర్ ఇరుగు మునిరాజా (చిన్న) ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రోపతిని, ట్రెడిషనల్ మెడిసిన్ ఎలక్ట్రోపతిని 1865లో ప్రసిద్ధ ఇటాలియన్ శాస్త్రవేత్త కౌంట్ సీజర్ మాటీ కనుగొన్నారు. అతను వైద్య రంగానికి తనను తాను అంకితం చేసుకున్నాడన్నారు. హెర్బ్స్ నయం చేయలేని వ్యాధులకు నివారణలను ఆయన కనుగొన్నాడన్నారు. మనిషి ప్రకృతి ఉత్పత్తి అని, ప్రకృతి చట్టంపై ఆధారపడిన వైద్య శాస్త్రం మాత్రమే దాని సృష్టిని నిరోధిస్తుందని, రక్షిస్తుందని అతను నిరూపించాడన్నారు. 114 మొక్కలలోని ఔషధ గుణాలను వెలికితీసి 38 మందులను తయారు చేశా డని తెలిపారు. తరువాత, అతను మరో 22 మందు లను జోడించి కాంప్లెక్సా-కాంప్లెక్సిన్-క్యూరాన్సుర్ అంటే సంక్లిష్టమైన వ్యాధిని సంక్లిష్ట ఔషధాల ద్వారా నయం చేస్తారని నిరూపించారని కొనియాడారు. ఎలక్ట్రోపతి భారతదేశంలో ఐదవ వైద్య విధానమని. దీని మందులు పూర్తిగా మూలికా ఆధారితమైనవని, (వైద్య మొక్కల నుండి వచ్చే స్పాజిరిక్ సారాంశం), ఇవి విషపూరితం కానివి, ఆల్కహాలిక్ లేనివి, ఎటువంటి దుష్ప్రభావాలూ లేని ప్రమాదకరం కాకుండా చాలా చౌకగా పేద ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ తిరుపతి అమర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొట్టంబేడు మండల టిడిపి సీనియర్ కార్యకర్త కాశీ సుబ్రమణ్యంను ఆ పార్టీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు సోమవారం పరామర్శించారు. ఆయనకు అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. సుబ్రమణ్యంకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మురళి నాయుడుతో పాటు ప్రముఖ వైద్యుడు, వ్యాపారవేత్త, పోతుగుంట రాజేష్ నాయుడు ఉన్నారు.

మహిళలపై హింస నిరోధం చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -రేణిగుంట : సమాజంలో మహిళలు ఆత్మస్థైర్యంతో మెలిగి అన్ని రంగాలలో అద్భుతంగా రాణిస్తున్నారని ప్రముఖ న్యాయవాది శ్రావణి స్పష్టం చేశారు. సోమవారం రేణిగుంట మండలంలోని కరకంబాడి రోడ్డు లోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళలపై హింస నిరోధంలో చట్టాల పాత్ర పై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. చట్టాలు, హక్కులు, బాధ్యతల గూర్చి అడ్వకేట్ శ్రావణి విపులంగా విశదీకరించారు. సమాజంలో మహిళ వివక్షకు గురవుతోందని విన్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ ఆర్.మీరా తెలిపారు. అనంతరం ఇద్దరిని దుశ్శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందు కుమార్ రెడ్డి,ప్రిన్సిపాల్ డా.కె.జయచంద్ర,ఉమెన్ ఎంపవర్మెంట్, ఉమెన్ ప్రొటెక్షన్ జాతీయ సేవ విభాగం నిర్వాహకులు చంద్రకళ, గ్రీష్మ, యస్.చక్రిశ్రీధర్ విద్యార్థినులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి -ఏర్పేడు : రాష్ట్రంలో ఎక్కడ లేని విధముగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిరుపేదలు ఎవరు చనిపోయిన వారికి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి 10వేల రూపాయలు అందిస్తున్నారు. ఏర్పేడు మండలం ముసలి పేడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైసిపి ఏర్పేడు మండలం ఇంచార్జ్ గున్నేరు కిషోర్ రెడ్డి మృతిని కుటుంబ సభ్యులని పరామర్శించి రూ. 10వేలు రూపాయలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మునిశేఖర్ రెడ్డి, ముని రాజా , మహేష్, మోహన్ కృష్ణ, సిరి బత్తయ్య ,గ్రామ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

రాజ్యాంగ ఆశయాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భారతదేశ ప్రజాస్వామ్యం పట్ల రాజ్యాంగ విలువలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టరు జి శ్రీనివాసులు రెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ ఆశయాలను విద్యార్థులు ముందుకు తీసుకువెళ్లాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 'భారత రాజ్యాంగ ప్రవేశిక' ను బిగ్గరగా పఠించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఎ నాగేశ్వరరావు భారత రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సభలో వైస్ ప్రిన్సిపాల్ వి వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు కె శ్రీనివాస్, రాయం రఘురామన్, అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్ర మైన తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజలే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామికి అన్నాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేసి వేద పండితులచే పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో కార్య నిర్వహణ అధికారి జై కుమార్, ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి భక్తులకు సౌకర్యంగా దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా తలకోనలో స్వామికి నిర్వహించే అభిషేకాలు, స్వామివారి పౌర్ణమి విశిష్టత గురించి ప్రధాన అర్చకులు ప్రసన్న కుమార్ శర్మ భక్తులకు వివరించారు.

సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోనీ టౌన్ హాల్ నందు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల భరోసా పథకంలో భాగంగా దివ్యాంగులైన పేదవారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా రోటేరియన్ చల్లా .రాంకుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సనత్ కుమార్ రెడ్డి, వై జెపి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి మాట్లాడుతూ రోటరీ క్లబ్, లైన్స్ క్లబ్ లు రెండు ఇంటర్నే షనల్ సంస్థలని, అంతర్జాతీయంగా ఈ రెండు సంస్థలు పేదలకు అవసరమైన ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయన్నారు. రోటరీ వెస్ట్ క్లబ్ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో వాసు గౌడ్, ధనంజయ రెడ్డి, సూర్య ఫ్యాన్సీ సుబ్రహ్మణ్యం, నాసిన నాగులు, బలరాం రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సంతాప సభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పాత్రికేయ వృత్తిని ఎంచుకొని, విలువలను పాటిస్తూ సమాజాభివృద్ధికి, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ ఇటీవల కాలంలో తనువు చాలించిన సీనియర్ జర్నలిస్టులు జిఆర్ నాయుడు, మించిన రవి, ఆవుల నాధముని యాదవ్, స్పోర్ట్స్ శ్రీనుల సేవలను నెమరు వేసుకుని సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో సంతాప సభను ప్రెస్ క్లబ్ కమిటీ నిర్వహించింది. ఈ సందర్భంగా మరణించిన నలుగురు సీనియర్ జర్నలిస్టుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంతాప సభలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జోగిరెడ్డి భాస్కర్ రెడ్డి, బాలచంద్ర, సభ్యులు శివయ్య, గోపాలకృష్ణయ్య, దామోదర్ నాయుడు, ప్రసాద్ తో పాటుగా విలేకరుల సమావేశం నిర్వహించడానికి వచ్చిన మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ వారి పార్టీ నాయకులతో కలిసి సంతాప సభలో పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పేకాట రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పురపాలక పరిధిలోనీ చెన్నూరు ప్రాంత శివారుల్లో పేకాట ఆడుతున్న పది మందిని గూడూరు రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. గూడూరు గ్రామీణ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. చెన్నూరు ప్రాంత శివారుల్లో పేకాట ఆడుతున్న పది మందిని, వారి వద్దనున్న 14,500 రూపాయలు నగదు, 5 బైక్ లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బ్రిటిష్ పాలనను పాటిస్తున్న బిజెపి: మాజీ ఎంపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి బ్రిటిష్ వారు భారత దేశంలో అవలంబించిన విభజించు పాలించు పద్ధతులను పాటిస్తూ దేశాన్ని విచ్చిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ హాండ్స్ ఆఫ్ ఇండియా సర్వే ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 83 స్థానాలు గెలిచి కాంగ్రెస్ అధికారాన్ని చేపడు తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గోపి, ప్రభాకర్, తేజవతి, సావిత్రి పాల్గొన్నారు.

అంకిత భావంతో చదవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అంకిత భావంతో చదివితే ఉన్నత లక్ష్యాలు చేరుకోవడం కష్టతరమేమీ కాదని స్కిమ్స్ బీ-స్కూల్ అధినేత, కరెస్పాండెంట్ మిద్దెల హరి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని కాపు గున్నేరి వద్ద ఉన్న స్కిమ్స్ బి స్కూల్లో 2023-24 విద్యా సంవత్సర ఎంసీఏ, ఎంబీఏ తరగతులను సోమవారం మిద్దెల హరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా తరగతులకు హాజరై ఏకాగ్ర తతో శ్రద్ధ చూపితే అనుకున్నది సాధించ వచ్చన్నారు. సీనియరు, జూనియర్ విద్యార్థులు చక్కటి సంబంధాలు కలిగి ఉండాలని సూచిం చారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ రఘురామరెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జున, సీఏ సింహాద్రి మన్యం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి.గీతాదేవి, చెన్నకేశవులు, ముని హేమ కుమార్, డిఎడ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ శ్రీకుమార్ పాల్గొన్నారు.

ఆలీకి పలువురి అభినందనలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న అంజాద్ ఆలీని పలువురు అభినందించారు. మైనార్టీ వెల్ఫేర్ విభాగం సెక్రటరీ ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. ఏటీఎన్స్ కాలేజీ కరస్పాండెంట్ నరేంద్ర, ఎస్ యూనివర్సిటీ లైబ్రరీ వెంకటేశ్వర్లు, వర్సిటీ ఫ్యాకల్టీ సిబ్బంది, పలువురు ఆయన అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

In The Court of The Hon'ble V Addl. District Judge: Tirupati
O.S.No.95/2017

T.Sankar (died) rep by his L.R's
T.Giriprasad and Others ...Plaintiffs
Vs
M.Krishnaiah (died) rep. by his L.R's
M.Venkata Ramaiah and Others ...Defendants

SUIT SUMMONS TO DEFENDANTS NO.3 AND 5

D3) ఎం.వెంకటరామయ్య తండ్రి లేట్ ఎం.క్రిష్ణయ్య
D5) ఎం.మురళీ తండ్రి లేట్ ఎం.క్రిష్ణయ్య
పై ఇరువురు నివాసము, డోర్ నెం.1-130, పైడిపల్లి గ్రామము, శానంబట్ల పోస్టు, తిరుపతి రూరల్ (మం॥), తిరుపతి జిల్లా

పై దావాను వాది ప్రతివాదిపై దాఖలు పరచి, దావా సొత్తులను అగ్రిమెంటు తేది. 29.05.2015 ప్రకారము రిజిష్టర్ చేయమని వేసుకున్న పై దావాలో 3 మరియు 5 ప్రతివాదులు అయిన మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది. 15.12.2023న పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనంతట పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుపడమైనది.

వాయిదా తేది 15.12.2023

ఎన్.రవి కుమార్, బి.శ్రీరాములు
అడ్వకేట్స్, తిరుపతి సెల్ 9959762439

మహారాజశ్రీ తిరుపతి అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
ఐ.పి.నెం.33/2021

లంకా నారాయణరావు ...పిటీషనర్
V/s
శ్రీమతి పోలి శ్రీదేవి మరియు ఇంకొకరు ...రెస్పాండెంట్స్

నోటీసు టు రెస్పాండెంట్ నెం.1

శ్రీమతి పోలి శ్రీదేవి, భర్త చింతకాయల రామచంద్ర, డి.నెం.3-180 న్యూ ఆంధ్రా బ్యాంక్ కాలనీ, అవిలాల గ్రామం & పోస్టు, తిరుపతి రూరల్ మండలం, సెల్: 8790366526

పై ఐ.పి. నందు పిటీషనర్‌కి 1.3.2020 తేదీ ప్రోనోటు బాకీ తీసుకొని బాకీ అయినావు. సదరు బాకీని తీర్చకనే నీ యొక్క స్థిరాస్తిని అవిలాల గ్రామం, ఆంధ్రాబ్యాంక్ కాలనీ నందు గల డి.నెం.3-180 గల ఆర్.సి.సి. ఇంటిని 2వ రెస్పాండెంట్ అయిన వి.ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తేది. 28.07.2021 సేల్ డీడ్ ద్వారా నామమాత్రము పత్రము చేసియున్నావు. సదరు 28.07.2021 తేది 1వ రెస్పాండెంట్ అయిన నీవు 2వ రెస్పాండెంట్ అయిన వి.ఎం.లక్ష్మీనారాయణరెడ్డికి వ్రాసి ఇచ్చిన డాక్యుమెంట్ నెం.3076/2021 పత్రమును రద్దు పరుచుటకు గాను పై ఐ.పి.ని దాఖలు పరచియున్నారు. సదరు డాక్యుమెంట్‌ను ఎందుకు రద్దుపరచకూడదో తెలియజేసు కొనుటకుగాను కోర్టువారు తేది. 05.12.2023న వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ఉదయం 10.30 గం॥లకు నేరులో గాని లేక వకీలు ద్వారా హాజరై నీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలసినది. లేనియెడల నీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది. 05.12.2023

వేదగిరి భాస్కర్ నాయుడు, పి.చందనా చౌదరి
పిటీషనర్ల తరపు న్యాయవాదులు, తిరుపతి

సీనియర్ సివిల్ జడ్జి వారి న్యాయస్థానం శ్రీకాళహస్తి

I.A.NO. 217 / 2022, H.M.O.P.NO. 69 / 2017

Between:
కె. హిమబిందు ....పిటిషనర్
AND
కె. సురేంద్రకుమార్ .... రెస్పాండెంట్

1. కె.సురేంద్రకుమార్, S/o వెంకటసుబ్బ రావు Door. No. 6/30, LIC కాలనీ చేయాలవారి కండ్రిగ దగ్గర తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా.

ప్రతివాది

1. పైన వివరించిన కేసు పిటిష్నర్ (వాది) క్లెయిముల పై జవాబు ఇచ్చుటకు రెస్పాండెంట్ (ప్రతివాది) హాజరు నిమిత్తం తేదీ 15-12-2023 ఉదయం 10.30 గం"లకు సీనియర్ సివిల్ జడ్జి వారి న్యాయస్థానం. శ్రీకాళహస్తిలో వాయిదా వేయబడిందని గమనించండి.

2. గౌరవ కోర్టు వారి తేదీ 15-12-2023 ఉదయం 10.30 గం॥లకు సీనియర్ సివిల్ జడ్జి వారి న్యాయస్థానం శ్రీకాళహస్తిలో రెస్పాండెంట్ (ప్రతివాది) హాజరుకావలసినదిగా మరియు పిటిష్నర్ (వాది) క్లైములకు సంబంధించి మీకు గాని మీ తరుపున న్యాయవాదిగాని అభ్యంతరాలు ఉన్నచో కోర్టు వారికి విన్నవించుకోవచ్చును.

3. ఒకవేళ రెస్పాండెంట్ (ప్రతివాది) సదరు న్యాయస్థానంలో తేదీ 15-12-2023 ఉదయం 10.30 గం॥లకు మీరు గాని మీ తరుపున న్యాయవాదిగాని సదరు విషయం పై హాజరుకాని పక్షంలో కోర్టువారు ఎక్స్ పార్టీగా తీర్మానించి నిర్ణయం తీసుకొందురు.

జి. ప్రసాద్, బి.కాం. బి. ఎల్.,
సి. వెంకటేశ్వర్లు, బి.కాం. ఎల్.ఎల్.బి.
న్యాయవాదులు, శ్రీకాళహస్తి.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No. 270 / 2022, O.S. No. 344 / 2021

Enugu Suneethamma ....పిటిషనరు / ప్రతివాది
Vs
Agasthya Sravan ....రెస్పాండెంట్ / వాది

ఆక్షేపణ నోటీసు

To
Agasthya Sravan, S/o Late. Dhanujaya Reddy,
Bazar Street, Gudur Town, Tirupati District.

పై నెంబరు దావాలో పిటిషనరు / ప్రతివాది పై మీరు పొందిన Exparte - Decree తేది. 8-12-2021 Set a side చేయమని పై కోర్టులో పిటిషను పెట్టి వున్నందున మీకు నోటీసు నిమిత్తం తేది. 18-12-2023న వాయిదా వేసినారు. కనుక ఆ రోజు మీరుగాని మీ తరుపున వకీలు గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు,
G. Dinakar Reddy,
పిటిషనరు / ప్రతివాది తరపున వకీలు,
గూడూరు.